

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో పొగమంచులో వెళ్తున్న వాహనదారుడు



గుడిహత్నూర్ మండలంలోని ధరమడుగులో మిషన్ భగీరథ శుద్ధ జలం నింపుకుంటున్న మహిళ




గుడిహత్నూర్ మండలంలోని సీతాగొందిలో..




గుడిహత్నూర్ గట్లపై కమ్ముకున్న మంచు

# మంచుకురిసే వేళలో..



గుడిహత్నూర్ గుట్టల మధ్య నుంచి ఉదయిస్తున్న సూర్యుడు

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను** చలి గజగజలాడిస్తున్నది. ఉష్ణోగ్రతలు పడిపోయి రోజు రోజుకూ తీవ్రత పెరుగుతున్నది. ఉదయం తొమ్మిదిగంటలైనా పొగమంచు తొలగకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణిస్తుండగా, మరికొందరు సూర్యుడి వెలుతురు వచ్చిన తర్వాతే బయటకు అడుగుపెడుతున్నారు. ఇక సాయంత్రం ఆరింటికే ఇగం మొదలవుతుండగా, రైతులు, కూలీలు త్వరగా పనులు ముగించుకొని ఇండ్లకు చేరుతున్నారు. చిన్నాపెద్దలంతా ఒకేచోట చేరి చలిమంటలతో సేదదీరుతున్నారు. ఇక కొందరైతే తప్పనిసరి పరిస్థితులో ఎముకలు కొరికే చలిని సైతం లెక్క చేయక తమ పనుల్లో నిమగ్నమవుతున్నారు. కాగా, శనివారం తెల్లవారు జామున 'నమస్తే తెలంగాణ' జిల్లా కేంద్రం, గుడిహత్నూర్ మండలంలోని ధరమడుగు, సీతాగొందిలను సందర్శించి 'క్లిక్' మనిపించిన దృశ్యాలు మీ కోసం.. *- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, డిసెంబర్ 16*



అలుకు వేస్తున్న మహిళ



చలి మంట కాగుతున్న చిన్నారులు



పశువుల పేడ తీసుకువెళ్తున్న రైతు



చేతి పంపు నుంచి నీళ్లు తెస్తున్న యువతి



పిల్లలను రెక్కల కింద కప్పేసిన కోడి

సాగవుతున్న మిర్చి



# పదింతలు పెరిగిన మిర్చి సాగు

- నిర్మల్ జిల్లాలో గణనీయంగా పెరిగిన పంట
- మార్కెట్‌లో మంచి ధరతో రైతులకు ఆశలు

## వాణిజ్య పంటల్లో మిరప టాప్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 16: నిర్మల్ జిల్లాలో పాత పంటల వైపు రైతులు మళ్లీ దృష్టిసారించారు. వాణిజ్య పంటల్లో మేలు రకాలైన మిర్చి సాగు వైపు ఆసక్తి చూపడంతో మిర్చి గణనీయంగా పెరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. నిర్మల్ జిల్లాలో పదేళ్ల క్రితం మిర్చి సాగు బాగానే ఉన్నప్పటికీ ఆ తర్వాత ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇవ్వడం, భూగర్భజలాలు సమృద్ధిగా ఉండడంతో పత్తి, మక్క, వేరుశనగ, పసుపు వంటి పంటలకు ప్రాధాన్యతనిచ్చారు. ఆ పంటలకు మార్కెట్లో ధర లేకపోవడం, దిగుబడులపై కూడా ప్రభావం చూపడంతో పంట మార్పిడిపై దృష్టి సారించారు. ఖరీఫ్ సీజన్‌లో మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న మిర్చికే అత్యధిక ప్రాధాన్యతనిచ్చి సాగు చేస్తున్నారు.

### పెరిగిన విస్తీర్ణం

నిర్మల్ జిల్లాలో ఈ ఖరీఫ్‌లో మిరప సాగు గణనీయంగా పెరిగింది. గతేడాది వరకు 200 ఎకరాల్లోపే సాగు కాగా ఈ సంవత్సరం 2 వేల ఎకరాలకు పెరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో నల్లరేగడి భూములు, భూగర్భజలాలు అధికంగా ఉండడంతో రైతులు మిర్చి పంటకు ప్రాధాన్యతనిస్తున్నారు. పంట కాలం 210 రోజులు కావడంతో 140 రోజుల నుంచే కాపు కాసి ఐదు సార్లు కాపు కాయడంతో ఎకరానికి 20-25 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని పేర్కొంటున్నారు. మార్కెట్‌లో క్వింటాలుకు 14 వేలకు పైగానే ధర పలుకుతోంది.

పచ్చి మిర్చి కూడా రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు ధర పలకడంతో రైతులు పంట చేతి కొచ్చినప్పటి నుంచి అయిపోయే వరకు నాలుగు సార్లు కాయలు కాయడంతో రైతులు లాభాలను గడిస్తున్నారు. ఇతర పంటలతో పోల్చితే పెట్టుబడికి అధికమైనప్పటికీ మిర్చి పంట పండితే తమ కష్టాలు దూరమవుతాయని సాగు చేస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా మిర్చిపై వివిధ తెగుళ్ల నివారణకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ దిగుబడులు పెరిగేలా రైతులకు సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు.

# బాబోయ్ బియ్యం

## వారంలోనే అమాంతం పెరిగిన ధరలు

- క్వింటాలుకు రూ.700-రూ.1000 పెరుగుదల
- బహిరంగ మార్కెట్‌లో రూ.6,400-రూ.7 వేలు..
- ధాన్యం పండించే రైతులకు పెరిగిన డిమాండ్..
- పొలాల వద్దకే వచ్చి కొంటున్న వ్యాపారులు
- భారతదేశం సహా ప్రపంచదేశాల్లో ఆహార సంక్షోభమే కారణం

మంచిర్యాల, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బియ్యం ధరకు రెక్కలొచ్చాయి. వారం క్రితం వరకు తక్కువగా ఉన్న ధరలు.. ప్రస్తుతం క్వింటాల్‌పై రూ.700 నుంచి రూ.1000 వరకు పెరగడంతో సామాన్యులు హైరానా పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పాతరకం హెచ్‌ఎంటీ, బీపీటీ రూ.6,400 క్వింటాల్ ఉంటే, ఫైన్, సూపర్ ఫైన్ వెరైటీలైన (జై శ్రీరామ్, సోనా మసూరీ, సాంబ మసూరీ, ఇతర సన్న రకాలు) క్వింటాల్‌కు రూ.6400 నుంచి రూ.7 వేల వరకు పలుకుతున్నాయి. వీటిలో కొత్త రకమైతే క్వింటాల్‌పై రూ.500 వరకు తక్కువ ఉంది. వారం క్రితం ఇంటి పక్కోళ్లకు రూ.5400 క్వింటాల్ ఇచ్చినవ్ కదా, మా కాడికి వచ్చే సరికి రూ.1000 పెరిగిందా.. పోయిన నెల పాత రేట్‌కే ఇచ్చినవ్ కదా.. ఎంతో కొంత తగ్గించంటూ వ్యాపారులతో బేరమాడే పరిస్థితి వచ్చింది. ధాన్యానికి గింత డిమాండ్ ఎందుకు వచ్చింది. కొన్నేళ్లుగా దాదాపు రూ.100 నుంచి రూ.200 తేడాతో నడిచిన మార్కెట్ అమాంతం ఎందుకు పెరిగిందనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



### తీవ్రమైన కరువే కారణం

దేశంలో ఈ ఏడాది ఊహించిన స్థాయిలో వర్షాలు పడలేదు. మన పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర సహా చాలా రాష్ట్రాల్లో ఈసారి వరి దెబ్బతింది. 2022 ఏడాది వరి పంటలకు పెద్దగా కలిసి రాలేదు. ప్రపంచ వ్యాప్తంగా ఇదే సంక్షోభ పరిస్థితి నెలకొంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచ దేశాలకు అతి పెద్ద గోధుమ ఎగుమతిదారుగా ఉన్న ఉక్రెయిన్‌లో ఈ ఏడాది పంటలు పండలేదు. ప్రపంచ దేశాల్లో ఆహార సంక్షోభం ఏర్పడనుంది. ఫలితంగా వంట నూనెల ధరలతోపాటు ఆహార ధాన్యాల ధరలు పెరిగిపోతున్నాయి. ఆ కారణంగానే గడిచిన వారం రోజుల్లో ధాన్యం ధర ఒక్కసారిగా 15 నుంచి 20 శాతం వరకు పెరిగిందని రైతులు, మార్కెట్ నిపుణులు, వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో వరి పండ లేదు. గోధుమ పెద్దగా దొరక్కపోవడంతో గోధుమలు ఎక్కువగా తినే ఉత్తర భారతదేశ రాష్ట్రాల్లోనూ వరికి డిమాండ్ పెరిగింది. తెలంగాణలో పెద్దగా కరవు ప్రభావం కనిపించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని ఎత్తిపోస్తున్న క్రమంలో భారీ వర్షాలు పడ్డాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. దీంతో వరి ధాన్యం ప్రతి ఏడాది లాగే ఈసారి చేతికొచ్చింది. దీంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వ్యాపారులు తెలంగాణకు వచ్చి ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నిజామాబాద్, కరీంనగర్ వ్యాపారులు వచ్చి వడ్లు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారంటే డిమాండ్ ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### ప్రభుత్వ ధర కూడా స్వల్పంగా పెరిగింది..

గత సీజన్‌లో క్వింటాల్‌కు ఏ గ్రేడ్ వడ్లకు రూ.2,060, కామన్ గ్రేడ్‌కు రూ.2,040 పలుకగా.. ఈ సీజన్‌లో ఏ గ్రేడ్‌కు రూ.2,203, కామన్ గ్రేడ్‌కు రూ.2,183 ప్రభుత్వం ఇస్తున్నది. సాధారణంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దొడ్డురకం వడ్లను విక్రయిస్తుంటారు. గతంతో పోలిస్తే ధర పెరిగినా.. చాలా మంది రైతులు ప్రైవేటు వ్యాపారులపై విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఎలాంటి దొడ్డు రకమైన సన్నాలుగా చేసి విక్రయించే సదుపాయాలు ఉండడంతో ప్రైవేట్ వ్యాపారులు కూడా దొడ్డు రకాలను ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే ఎక్కువ ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. ఇక సన్న రకాలపై క్వింటాల్‌కు రూ.3,100 నుంచి రూ.3,200 వరకు వెచ్చించి ప్రైవేటోళ్లు కొనుగోలు చేస్తున్నారు. పంట పొలాల్లో కోత కాగానే డబ్బులిచ్చి తీసుకెళ్తున్నారు. వడ్లు ఆరబెట్టాల్సిన అవసరం లేకుండా వాళ్లే కొంటున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు, మిల్లర్ల దగ్గరకు పోయే అవసరం లేకుండానే రైతులకు వ్యయప్రయాసలు తప్పాయి. బ్రోకర్లు, వ్యాపారులు రైతుల దగ్గరకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధాన్యం సాగు చేసిన రైతులకు మంచి రోజులు వచ్చాయి.





మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన వివిధ రకాల బియ్యం బస్తాలు



పెంచికల్‌పేట్ అడవుల్లో అటవీ శాఖ కెమెరాలకు చిక్కిన పులి (ఫైల్)

# పులులకు రాచబాట..

## టైగర్స్‌కు సురక్షిత ప్రాంతంగా ఆసిఫాబాద్ జిల్లా అడవులు

- తడోబా, తిప్పేశ్వర్ నుంచి వచ్చి స్థిరనివాసం
- సత్ఫలితాలు ఇస్తున్న సంరక్షణ చర్యలు
- కవ్వాల్‌లో పెరుగుతున్న సంఖ్య
- ప్రస్తుతం 14 వరకు ఉన్నట్లు అంచనా
- పుష్కలమైన నీటి వనరులు, వన్యప్రాణులు ఉండడమే కారణం



కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులు పులులకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. దట్టమైన అడవులు, నీటి వసతి, వన్యప్రాణులు ఉండడం పులుల సంతతి పెరిగేందుకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా గత ఏడెనిమిది సంవత్సరాలుగా పులుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2012లో కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి అటవీ అధికారులు పులుల సంరక్షణకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఇక్కడి అడవులు పులులకు అనుకూలంగా ఉండడంతో తడోబా, తిప్పేశ్వర్ నుంచి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. 2015లో కదంబా అడవుల్లో ఓ ఆడపులి నాలుగు పిల్లలకు జన్మనిచ్చినట్లుగా అధికారులు గుర్తించారు. రెండో ఈతలో మారో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. యుక్త వయసు(18 నెలలు)కు వచ్చే పులులు తల్లి నుంచి వేరుపడి స్వతంత్రగా జీవిస్తున్నాయి. ఈ పులులు ఆవాసం కోసం మంచిర్యాల కవ్వాల్‌తో పాటు తడోబా, ఇంద్రావతి అభయారణ్యాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం తడోబా, ఇంద్రావతి, అభయారణ్యాలకు కారిడార్‌గా ఉండడంతో పులులు స్వేచ్ఛగా ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో పులులు 14 వరకు ఉన్నట్లుగా అంచనా. గతంలో పెంచికల్‌పేట్ అడవుల్లో నాలుగు పులులు(రెండు జంటలు) స్థిర నివాసం ఏర్పరచుకోగ మిగతా పులులు ఆవాసం కోసం అడవుల్లో సంచరిస్తున్నట్లు భావిస్తున్నారు. పులుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్న అటవీ అధికారులు ప్రత్యేకంగా ట్రాకర్ల ద్వారా పులుల కదలికలను పరిశీలిస్తూ వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.

### స్థిర నివాసం కోసం సంచారం

18 నెలలు నిండిన పులులు యుక్తవయసు రాగానే తల్లి నుంచి వేరుపడి స్థిర నివాసం ప్రయత్నిస్తుంటాయి. ఇందులో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులతోపాటు మంచిర్యాల జిల్లా అడవుల్లో సంచరిస్తున్నాయి. బెజ్జూర్, పెంచికల్‌పేట్, పెద్దవాగు, ప్రాణహిత, దహెగాం, కర్జీ, బెల్లంపల్లి, వేమనపల్లి, చెన్నూర్ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు పులులు శారీరకంగా కలుసుకునే సమయం కావడంతో మగపులులు ఆడతోడుకోసం అడవుల్లో విస్తృతంగా పర్యటిస్తుంటాయి. ప్రస్తుతం కాగజ్‌నగర్ కారిడార్‌లో పులులు సంచారం ఎక్కువగా ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లోని ప్రాణహిత, ఇంద్రావతి నదులను దాటుకొని పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. జిల్లాలో పులులు అధికంగా సంచరించే ప్రాంతాలపై దృష్టిసారించిన అధికారులు వాటి సంరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నారు.

### అటవీ అధికారుల అప్రమత్తం

ఇది పులులు సంగమించే సమయం. తోడు కోసం పొరుగున ఉన్న మహారాష్ట్రలోని టైగర్ జోన్ నుంచి ప్రాణహిత నదిని దాటుకొని ఇక్కడికి రావడం సాధారణమైంది. ఇటీవల కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామం సమీపంలో పశువుల కాపరి గులాబ్‌పై పులిదాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన అధికారులు అటవీ ప్రాంత గ్రామాల్లో ప్రజలను అవగాహన కల్పిస్తున్నారు. గతంలో పులుల దాడులు జరిగిన ప్రాంతాలు, పులి సంచరించే ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

| | |
|---|---|
| ఉమ్మడి జిల్లాలో అటవీ విస్తీర్ణం : 6045 (చదరపు కిలో మీటర్లు) | |
| కవ్వాల్ అభ్యయారణ్యం: | 2015.44 |
| కోర్ ఏరియా | : 892.23 |
| బఫర్ ఏరియా | : 1123.21 |
| ప్రాణహిత అభయారణ్యం : | 132.02 |